# వర్షించిన రాత్రి...

ప్లేన్ బయల్దేరింది.

హోస్టెస్ రాధకు డ్రింక్ ఇచ్చి వెళ్ళింది.

చదువుకునే రోజుల నుంచీ, దూరప్రదేశాలకు వెళ్ళాలనీ, క్రొత్త అనుభవాన్నీ, అనుభూతినీ పొందాలనీ వువ్విళ్ళూరేది రాధ.

ఈ నాటికి ఆ అవకాశం లభించినందు కెంతో సంతోషించింది.

డాక్టరుగా రాధ ఆర్మీలో చేరబోతోంది. దేశసేవ చేస్తే మాతృభూమి తనను దీవిస్తుందని తద్వారా తనవృత్తికే గౌరవం లభిస్తుందని ఆశ. అదే తన ఆశయం కూడా.

---

ఏప్రిల్ '67 కృష్ణాపత్రికలో ప్రచురితము

విమాన ప్రయాణం కొత్తనివ్వంచటంతో రెండుకళ్లూ మూసుకు కూర్చుంది, యెక్కడ కళ్ళుతిరిగి వాంతి వస్తుం దోని.

"మీరు ... విమాన ప్రయాణం చేయటం ఇదే మొదటిసారా?—" ప్రక్కసీట్లో మిలిటరీ యూనిఫారంలో వున్న వ్యక్తి స్వచ్ఛమైన తెలుగు భాషలో ప్రశ్నించేడు.

కళ్ళు తెరచి అవునన్నట్లు ఆవ్యక్తికేసి చూచి తలాడిం చింది రాధ.

ప్లేనెక్కిన క్షణంనుండి ప్రక్కసీట్లోవ్యక్తి తనను తదే కంగా చూడటం రాధ క్రీగంట గమనిస్తూనే వుంది.

ఆయన్ను చూస్తుంటే ఎక్కడో ...ఎప్పుడో ... పరి చయమున్న మనిషిలా అవుపిస్తున్నాడు. పోనీ అడిగి తెల్సు కుందా మనుకుంటే అభిమానం అడ్డొచ్చింది. మనిషిని బోలిన మనుష్యులుండచ్చని వూరుకుంది.

రాధ మనసు ఆయన్ను గురించే ఆలోచిస్తోంది. అంత లోనే గతంలోకి పరుగెత్తుతున్న మనస్సు రాధ చిన్నతనాన్ని జ్ఞప్తికి తెచ్చింది....

సూర్యంబావ కళ్ళముందు మెదిలేడు.

ఇంటి విషయాలన్నీ బాగా గుర్తున్నాయి తనకు. అందుకే బావను మర్చిపోలేదు. బావంటే యెంతో ఇష్టం తనకు. ఇంట్లోనుండి పారిపోకుండావుంటే బావను తనకిచ్చి పెళ్ళి చేసేవాడు నాన్న.

బావ తనకేగాదు... అందరికీ దూరమయ్యాడు.

మామయ్య చనిపోవటంతో అత్తయ్య తాతయ్య పంచనే చేరాల్సి వచ్చింది.

అత్తయ్యకు చదువు చెప్పిస్తే, స్వశక్తిమీద స్వతంత్రంగా బ్రతగ్గలదనే వుద్దేశ్యంతో చదువులోకి దింపేడు తాతయ్య.

జీవితంలో పూర్తి ఆనందాన్ని చవిచూడకముందే భర్త చనిపోవటంతో... అత్తయ్య మనసు చదువుమీద లగ్నం కాలేదు.

కొన్నాళ్ళకు ప్రైవేటు మాష్టారితో అత్తయ్యకు సన్నిహితత్వం యేర్పడ్డది. చాలారోజుల వరకూ ఈ విషయం యెవ్వరికీ తెలీయలేదు.

మేష్టారితో అత్తయ్య పరిచయం చాలా దూరం పోయింది. చివరకు తాతయ్యకీ విషయం తెలిసి చదువు మాన్పించాడు.

మాష్టారు ఇంటికి రావటం మానేశాడు.

అత్తయ్యకు, తాతయ్య దగ్గర రోజులు గడపటం రాను రాను కష్టమైంది. ఇద్దరూ సూటీపోటీమాట లనుకోవటం, ఘర్షణపడటం లాంటివి జరుగుతూ వచ్చాయి.

తండ్రిలేని పిల్లవాడు బావ. తాతయ్య బావను గారాబంగా పెంచుతూ రావటంతో అల్లరి, ఆటకాయతనం బావలో మెక్కువైనాయి. ఇంట్లో డబ్బులు కాజేయటం, పారిపోవటం రెండు మూడుసార్లు జరిగింది. బావ భవిష్యత్ గురించి తాతయ్య ఆందోళన పడసాగేడు. పోలీసురిపోర్టు,

పేపర్లో వేయించటంవంటి పన్నద్వారా బావ ఆచూకీ తెలుసు కుని మళ్ళీ బావను ఇంటికి తీసుకొచ్చేవాడు తాతయ్య.

అత్తయ్య పసుచుదనం ఆమెకు చదువు అబ్బనివ్వ లేదు. ఆమెలో జీవితానుభవాలు అసంతృప్తిగ మిగిలి పోవటంతో మళ్ళీ సంసారజీవితంలో కాలుబెట్టాలనే వుద్దేశ్యం ఆమెలో కలిగింది.

స్వతంత్రంగ, స్వేచ్ఛగ బతుకు గడపాలనే వుద్దే శ్యాలు. అత్తయ్యలో యెక్కువవ్రుతూ వచ్చాయి—బావను అదుపాజ్ఞల్లో పెంచేందుకు ప్రయత్నమైనా చెయ్యలేదు.

సినిమాకని ఇంట్లో చెప్పివెళ్ళి మాష్టారివెంట తిరగటం తాతయ్య కనిపెట్టాడు. మొహం వాచేలా చీవాట్లుపెట్టాడు.

మాష్టారి అండ చూచుకున్న అత్తయ్య, తాతయ్య మాటలు పెడచెవిన పెట్టింది.

తాతయ్య చేతగానివాడని, కూతుర్ని అదుపులో పెట్టలేనివాడని అందరూ హేళన చేశారు.

అన్నీ భరించాడు తాతయ్య.

కానీ... తాతయ్య బాధల్లా బావ భవిష్యత్ గురించి.

అత్తయ్య, తాతయ్య యెంతచెప్పినా వినకుండా విడి కాపురం పెట్టింది. బావనుకూడా వెంట తీసుకెళ్ళింది.

తాతయ్య భయం మరికాస్త దూరమవటంతో బావ మరీ అల్లరివా డయ్యాడు.

మళ్ళీ బావ ఇంట్లోంచి వెళ్ళిపోయాడని తాతయ్యకు తెల్సింది. తాతయ్య మనోవేదన మరింతెక్కువైంది.

బావ అడ్డుగ వుంటంతో మాష్టారే ఇంట్లోంచి వెళ్ళ గొట్టేడని అంతా అనుకున్నారు.

బావను వెతికి తెచ్చేందుకు అత్తయ్యలో శ్రద్ధవున్నా మాష్టారి నిర్బంధానికి తలవంచక తప్పలేదు.

ఆ తర్వాత మళ్ళీ సూర్యంబావను చూడలేకపోయింది తను. అప్పటికీ ఇప్పటికీ బావను మర్చిపోలేకుండా వుంది.

"మీ ప్రయాణం యెక్కడిదాకా ?" మళ్ళీ ప్రకాశ్ యన అడిగేడు.

రాధ ఆలోచనలకు అంతరాయం కలిగింది.

"పఠాన్‌కోట వరకు" అంది ముక్తసరిగా.

"పఠాన్‌కోట యెందుకొస్తున్నట్టు ?" సంభాషణ పొడిగించాడు.

"ఆర్మీలో డాక్టర్‌గ సెలక్‌నొచ్చింది జాయినయ్యేం దుకు వెడుతున్నాను."

"ఐ యామ్ సారీ నా పేరు ప్రకాష్. మేజర్ జనరల్. నేనూ పఠాన్‌కోటకే వస్తున్నాను ... అవునూ ... మీ కా ప్రదేశం క్రొత్తేమో?"

"అవునండి. పూర్తిగా క్రొత్త !"

"నాకూ అంతే ! మరేం భయంలేదు. నా చేతనైన సాయం చేస్తాను. మనమంతా వక్కగూటిలో వాళ్ళమేగా ..."

చమత్కారానికి మనసులో నవ్వుకుని "థాంక్స్" అంది.

"పదిరోజుల క్రితంవరకూ- నన్ను కాశ్మీర్ బార్డర్లో వుంచారు. ఈ మధ్యనే పి. కోటకు ట్రాన్స్ఫరు చేసేరు. జాయి నయ్యేందుకు వెడుతున్నాను... ఇంతకూ మీా పేరు ?"

"రాధ"

"చక్కని పేరు. అసలు ... తెలుగువారికి రాధ, మాధవి అనే పేర్లంటే యెక్కువ ఇష్టం, ఇంతకూ మీారు..."

ఆయన మాటల్లో శ్లేషాన్ని అర్థంచేసుకున్న రాధ 'మిస్. రాధ అంతే' అంది.

ఇద్దరూ నవ్వుకున్నారు.

"చూడండి. నేను తెలుగువారితో మాట్లాడి కొన్ని సంవత్సరాలు దాటింది. అందుకే ... మీారు తెలుగువారని తెలీగానే...మీా అనుమతి లేకుండానే చనువుగా మాట్లాడేం దుకు సాహసిస్తున్నాను..."

"నా...నో...ఫర్వాలేదు. మాట్లాడండి. నాకూ కాస్త కాలక్షేపంగ వుంటుంది."

మళ్ళీ ఇద్దరూ నవ్వుకున్నారు.

ప్లేన్ పఠాన్కోట చేరింది.—

జనరల్ ప్రకాష్ను రిసీవ్ చేసుకునేందుకు యెంతో మంది మిలటరీ ఆఫీసర్లొచ్చారు ఎయిరోడ్రోంకు.

"మిస్ రాధా! రండి! నా జీపులోనే వెడదాం. ఆ తర్వాత సురక్షితంగామిమ్మల్ని మీా యూనిట్ కు చేరుస్తాను."

ప్రదేశం కొత్తకావటంతో రాధ ప్రకాష్ వెంట మౌనంగా బయల్దేరింది.

సాయంత్రం వరకూ రాధ ప్రకాష్ క్వార్టర్సులోనే రెస్టుతీసుకుంది. తన కిచ్చిన గౌరవానికి, చూపిన అభిమానానికి ముగ్ధురాలైంది రాధ.

ఐదయ్యేసరికి మళ్ళీ జీపులో బయల్దేరేరు.

"చూడండి. రేపటినుండి మీరు నాకు కన్పించరు గదూ!..." అదోలా అన్నాడు జీపు డ్రైవ్ చేస్తున్న ప్రకాష్.

రాధ మాటమార్చేందుకు ప్రయత్నిస్తూ "మీరు ఇక్కడెన్నాళ్ళుంటారు?..." అంది.

"చెప్పలేను. చేస్తున్నది ప్రభుత్వోద్యోగం. ఏ నిముషానికి యెక్కడికి పంపిస్తారో వూహించలేం — అయినా, మిమ్మల్ని కలుసుకునేందుకు, నేనిక్కడున్నన్నాళ్ళూ రోజు కోమారైనా వస్తాను ... మీకు అభ్యంతరం లేకపోతే..."

"ఎందుకు లెండి మీకు శ్రమ. ఆఫ్ రోజున నేనే మిమ్మల్ని కల్సుకునేందుకు ప్రయత్నిస్తాను."

"చూడండి :- ఇంతవరకు నే నెవరో... మీ రెవరో. అలాంటిది... మీతో నాకు పరిచయం ప్రారంభమైన క్షణం నుండి... మీతో మాట్లాడుతుంటే నా కెంతో హాయిగావుంది. యాంత్రికంగా జీవితం గడపటం అలవాటుపడ్డనాకు ... మీ పరిచయంతో కాస్త 'రిలీఫ్' వచ్చినట్లు ఫీలవుతున్నాను..."

"చాలా చమత్కారంగ మాట్లాడతారు."

జీపు అగింది.

రాధ ప్రకాష్‌ను అనుసరించింది.

మెడికల్ యూనిట్ ఇన్చార్జి ఆఫీసరుకు రాధను పరిచయంచేసేడు ప్రకాష్.

♦ ♦ ♦

చేస్తున్న వుద్యోగంలో రాధ వూహించిన దానికంటే యెక్కువ ఆనందం, తృప్తి కన్పిస్తున్నాయి.

ప్రకాష్ తరచుగా రాధకోసం రావటం, ఇద్దరూ కలసి కాస్సేపు పిచ్చాపాటీ మాట్లాడుకోవటం జరుగుతోంది.

ప్రకాష్ వెంట తిరిగేందుకు రాధ మొదటిరోజుల్లో బిడియపడ్డా... అతని పరిచయం, స్నేహం రాధకు చాలా సరదాగా వుందన్పించింది.

రానురాను ఇద్దరిమధ్యా సన్నిహితత్వం ప్రబలుతూ వచ్చింది.

డ్యూటీ అవగానే ఓరోజు సరాసరి క్వార్టర్సుకొచ్చేసింది రాధ. కిటికీ ప్రక్కనేవున్న క్యాంపుకాట్ మీద కూర్చుని పరాగ్గా ఆలోచిస్తోంది దేన్నిగురించో...

ఆకాశం మేఘావృతమైంది. వర్షంవచ్చే సూచన్లు కన్పిస్తున్నయి.

"ఏమిటిరాధా ఆలోచిస్తున్నావ్?" లోపలికొస్తూ ప్రకాష్ అడిగేడు.

అప్రమత్తతనుండి మేల్కొన్న రాధ "రండి, ఎంత సేపైంది వచ్చి..." ఆహ్వానించింది. ?

"ఇదే రావటం. అదిసరే ... దేన్ని గురించి అంత తీవ్రంగా ఆలోచిస్తున్నావు. నీ వంటరితనాన్నిగురించేనా?" అంటూ కుర్చీలో కూర్చున్నాడు.

"కాదు"

"అయితే... అమ్మానాన్నగురించి ఆలోచనైవుండ వచ్చు. వారి ప్రేమను వదిలి ఇంతదూరం యెందుకొచ్చా మాని ఆలోచిస్తున్నావుకదూ ?"

"అదేంకాదు పదండి వెడదాం."

"ఎక్కడికి ?"

"ఎక్కడికైనాసరే. సరదాగా అట్లా బైటికెళ్ళొద్దాం!"

"వర్షంవచ్చే సూచన్లు కన్పిస్తున్నాయి. తీరా మనం బయల్దేరేక వర్షంవస్తే... ?"

కిటికీలోంచి ఆకాశంకేసి చూచింది రాధ. మెరుపు వెలుగుకి కాస్సేపు కళ్ళు బైర్లుకమ్మినయి.

చిటపట చినుకులతో ప్రారంభమైన వర్షం రానురాను పెద్దదైంది.

వర్షపు చినుకుల వృత్తాన్ని తదేకంగా చూస్తూ వుండిపోయాడు ప్రకాష్.

మౌనంగా కూర్చున్న రాధకు సూర్యంబావ మళ్ళీ గుర్తొచ్చాడు. ఆలోచనా పరంపరలు రాధ మస్తిష్కాన్ని సతమతం చేస్తున్నయి.

"ఏమిటాలోచిస్తున్నారు—" రాధ ప్రశ్న.

"ఊఁ... నేనా ! ఆఁ... అదే... వర్షంమూలంగ మన ప్రోగ్రాం కేన్సిలయిందే అని."

"అది సరేగాని మిమ్మల్ని ఓ విషయం అడగాలని వుంది. నిజం చెప్తారా ?"

"ఏమిటది ?" నిశితంగా రాధ కళ్ళల్లోకి చూసేడు.

"అదే ఇన్నాళ్ళుగా నన్ను వేధిస్తున్న ప్రశ్న. ఎన్నో రోజులుగా మిమ్మల్ని అడగాలనుంది. నిజం తెసుకోవాలను కున్నాను. కానీ అడిగేందుకు సాహసించలేక పోతున్నాను."

రాధ అడగదలుచుకున్న దేమిటో అర్థం చేసుకున్న వాడిలా మళ్ళీ నవ్వేసి అడుగు రాధా సంకోచిస్తావేం, అయినా నాకు తెలుసు నువ్వేమడగాలనుకుంటున్నావో."

మొదట్లో సిగ్గుపడి 'నన్ను మీరు ప్రేమిస్తున్నారా..." సూటిగా అడిగింది.

"నువ్వడగదల్చుకున్న ప్రశ్న ఇదికాదు. మాట మార్చావేం ?"—

"మీతో పరిచయం ప్రారంభమైన క్షణంనుంచీ మీ రంటే చెప్పలేని అభిమానం, ఆప్యాయత నాలో కల్గినయి. మీ అభిప్రాయంకూడా అంతేగదూ ?.

"చూడు రాధా ! ప్రేమించటమంటే ఏమిటో నాకు తెలీదు. కానీ, నిన్ను నా ఆత్మీయులకంటె మెక్కువగా గౌరవిస్తున్నాను. అది మాత్రం నిజం."

"నేనంటే మెందుకంత అభిమానం?"

"నువ్వడగబోయే ప్రశ్నబట్టి నా సమాధానం ఆధార పడివుంది. ఇంతకూ నీ సందేహామేమిటో, చెప్పనేలేదు."

"అట్లా అడగాలనే ఆలోచిస్తున్నాను. అయినా సమ యం వచ్చింది గనుక అడక్కుండా వుండలేక పోతున్నాను. మిమ్మల్ని చూచేక మా సూర్యంబావ గుర్తొచ్చాడు నాకు.

మా బావ అచ్చు, మీ పోలికే మీలాగే వుంటాడు. చిన్నప్పుడెప్పుడో చూచాను. అందుకే మీ గురించి వివరాలు తెల్సుకోవాల నుకున్నాను. మనుష్యులను పోలిన మనుష్యు లుంటారని సందేహించాను. నిజమేనా, నే ననుకున్నది నిజమేనా?' ప్రశ్నల వర్షంతో ప్రకాష్‌ను వుక్కిరి బిక్కిరి చేసింది.

కూర్చున్నవాడల్లా లేచి కిటికీదగ్గర కెళ్ళాడు. వర్షపు చినుకుల కేసి తదేకంగా చూస్తూ వుండిపోయాడు.

"అయితే, నేను అనుకున్నదీ, ఊహించినదీ నిజమే నన్నమాట." రాధముఖం ఆనందంతో పురివిప్పింది.

"నిజమే రాధా - నిజమే!—ఈ వర్షాన్ని చూస్తుంటే భయంకరమైన నా చిన్నతనం జ్ఞాపకంవస్తోంది—ఆ రోజు నే నింట్లో నుండి పారిపోయి వచ్చి విజయవాడ రైలెక్కాను. ఆ రోజు కూడా ఇట్లాగే వర్షం ధారాపాతంగ కురుస్తోంది టిక్కెట్టులేకుండా ప్రయాణంచేస్తున్న నన్ను ఏలూరు స్టేషన్లో పోలీసులు దించేశారు. బాలనేరస్థుల బోస్టర్ స్కూలుకు పంపేరు. పదిహేడేళ్లు పూర్తయ్యాక మిలటరీలో చేరాలన్పిం చింది. కొన్నాళ్ళకు ప్రభుత్వం నన్ను స్పెషల్ ట్రైనింగ్ కోసం ప్రమోషన్ మీద డెహరాడూన్ పంపింది. భగవంతుడు నాకు చేసిన మేలల్లా వక్కటే!—ట్రయినింగ్ పూర్తయిన సంవత్సరమే నాలోవుండే వుత్సాహాన్ని గుర్తించి ప్రభుత్వం నన్ను ఢిల్లీ పంపింది. తర్వాత ఆఫీసర్ పద విచ్చారు. దేశం కోసం సర్వస్వాన్నీ త్యాగం చేసేందుకై సిద్ధపడ్డాను. కొన్నా

ళ్ళకు కాశ్మీర్ బార్డరుకు పంపేరు. ఈ విధంగ ...నాకు ప్రతి నిత్యం వున్నత భవిష్యత్‌ను కలుగచేసిన ప్రభుత్వానికెంతో ఋణపడివున్నాను—ఉద్యోగంలో స్థిరపడ్డాక అమ్మకెన్నో వుత్తరాలు వ్రాశాను — ఓసారి నేనే బయల్దేరి స్వయంగ వూరెళ్ళాను... అమ్మ అక్కడ వుండటంలేదని పక్క ఇళ్ళ వాళ్ళు చెప్పారు. తాతయ్య చనిపోయాడన్న వార్త అన్నిటి కంటె నన్ను మరింత బాధించింది. మర్చిపోలేని బాధతో బరువైన మనోవేదనతో తిరిగి ఢిల్లీ వెళ్ళిపోయాను' చెమ్మ గిల్లిన కళ్ళుతుడుచుకున్నాడు ప్రకాష్.

"పోన్లే బావా నిన్ను చూడలేనేమో అనుకున్నాను. మళ్ళీ నిన్ను చూడగలిగేను. అయితే బావా నేను నీకు జ్ఞాప కంవున్నానా...చూడు బావా! మన విషయం ఇప్పుడే నాన్నకు తెలియపరుస్తాను. ఏం?" ప్రకాష్‌కు దగ్గరగా వచ్చింది.

"వద్దు రాధా, వద్దు! నన్ను అజ్ఞాతంగానే వుండనీయి'

"ఏం? ఎందుకని బావా?'

'రాధా! నేను ఇంతవరకూ జీవితాన్ని వక విధంగానే గడిపేందుకు అలవాటుపడ్డాను. అలాటి నేను తిరిగి మళ్ళీ మామూలు మనుష్యుల మధ్యకు రాలేను."

ప్రకాష్ సమాధానం రాధను నిశ్చేష్టురాలను చేసింది.

"బావా పోనీ మనమే మన వూరెళ్ళిపోదాం ఏం.?

"వద్దు రాధా, వద్దు నన్ను వంటరిగానే వుండనీయి ప్రపంచంలో నేనెవ్వరికోసమూ పుట్టలేదు."

"పోనీలే బావా ఈ రోజు నాకెంత ఆనందంగావుందో తెలుసా! అంతా నే అనుకున్నట్టె జరిగింది' అంటూ ప్రకాష్ చేతులు తన చేతుల్లోకి తీసుకుంది.

ప్రకాష్ దూరంగా జరిగాడు.

"రాధా నీలో ఆనందోత్సాహాలు రేకెత్తించినందుకు మరో విధంగ అపార్థంచేసుకోకు. మనం మరింత దగ్గరయి మమకారాలను పెంచుకోకూడదనే నేను నీ బావనని ఇంత వరకూ చెప్పాలేదు!'

'ఏమిటి బావా విచిత్రంగ మాట్లాడుతున్నావు. నీ మాటలు నా కర్థం కావటంలేదు' విస్తుపోయింది రాధ.

'ఇప్పటికే నీ మనసెంతో గాయపరిచాను. అంతకంటే నేనేమి చెప్పలేను" ముఖం ప్రక్కకు తిప్పుకున్నాడు.

"అంటే, నేనంటే నీ కిష్టంలేదా బావా?!" ఆవేదనతో అడిగింది.

'రాధా! ఈ ప్రపంచంలో నాకు ఇష్టమైనదేదైనావుందీ అంటే అది నువ్వే! అంతమాత్రాన'

"అదేమిటి బావా అయితే ఇన్ని రోజులుగా నేనంటే' ఇష్టంగావుంటూ, నా వెంటేవుంటూ నేనేకావాలని యెందుకు కోరుకుంటున్నావ్!'

'అదే పొరపాటు రాధా! నేను నిన్ను ప్రేమించటం లేదు. అభిమానిస్తున్నాను. కేవలం నీ అప్యాయత ఆదరణ కోసమే నువ్వు కావాలనుకున్నాను.'

"అయితే అసలు పెళ్ళే చేసుకోవా!" నిర్ఘాంతపోతూ అడిగింది.

"క్షమించు రాధా! నా గురించి నాకు కొన్ని ఖచ్చితమైన నిశ్చితాభిప్రాయాలున్నాయి. నేను చేస్తున్నది మిలిటరీ వుద్యోగం. ఏ నిముషంలో యే వుపద్రవంవస్తుందో నాకు తెలీదు. నా కళ్ళముందే యెన్నో ఘోరాలు చూశాను. కొత్తగా పెళ్ళిళ్ళు చేసుకున్నవారు, ప్రేమించినవారి నొదిలి సైన్యంలో చేరినవారు జీవితాలను దేశంకోసం అర్పించారు. వారి వెనుక వాళ్ళకు కావలసినవాళ్లు తాళికట్టించుకున్నవారు కనీపెంచిన తల్లిదండ్రులు యెందరు క్షోభించిపోయారో నేనూహించగలను. అవన్నీ తెలుసుకున్న నేను నాలోవుండే కోర్కెలను చంపుకోగలిగాను. కఠినమైన నిర్ణయానికొచ్చాను కత్తిమీద సామువంటి వుద్యోగంచేస్తూ ఏ నిముషంలో ప్రాణానికి ఏ వుపద్రవంవస్తుందో వూహించలేని మాబోటివాళ్ళు, పెళ్ళిళ్ళుచేసుకుంటే మరోనిండుప్రాణాన్ని బలితీసుకున్నట్టే అవుతుంది. మా మీదే ఆశలు పెట్టుకు జీవించేవారి జీవితాలు భగ్నమవుతయి. జీవితాలు బ్రద్దలవుతయ్ అందుకే నేను పెళ్ళి విషయమే తలపెట్టలేదు. అలాంటి వుద్దేశ్యమే నాలో లేదు. అయితే ఇన్ని రోజులుగ నీతో హృదయం విప్పి మాట్లాడిందీ, నీ వెంటే తిరిగిందీ, నీవే కావాలని కోరుకుందీ కేవలం మనశ్శాంతికోసం. అంతేగాని, నీహృదయాన్ని గాయపర్చాలనీ, నీలో ఆశలు రేకెత్తించాలనీ మాత్రంకాదు. నిన్ను నేను ప్రేమిస్తున్నాననుకుంటే క్షమించు. ఆ దృష్టితో నీహృద

యాన్ని గాయపరచివుంటే ఇకనుండి నేను నీకు దూరంగా వుండేందుకు ప్రయత్నిస్తాను. నీకు కన్పించి నిన్నూ, నీ హృదయాన్నీ మరింత గాయపర్చలేను. క్షమించు రాధా" అనేసి చరచరా బైటికి నడిచాడు.

వర్షంలో తడుస్తూనే నడుచుకుంటూ వెళ్ళిపోయాడు మేజర్ జనరల్ సూర్యప్రకాష్.

హృదయాన్ని కుదుటపర్చుకునే శక్తిలేక పొంగివచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ అచేతనంగ పక్కమీద వాలిపోయింది రాధ.